
ఉపాధికి ఇంధనం

వైఎస్సార్ వాహన మిత్ర
- ఆటో కార్మికుల జీవితాల్లో వెలుగులు
- ఏటా రూ.10 వేలు జమ
- జోన్-5లో 3,575 మందికి లబ్ధి


కంచరపాలెం: తన సొంత ఆటోతో లబ్ధిదారుడు


తాటిచెట్లపాలెం: ఆటోతో లబ్ధిదారుడు


జ్ఞానాపురం: సొంత ఆటోతో లబ్ధిదారుడు

కంచరపాలెం: ప్రజాసంకల్ప యాత్రలో ఆటో కార్మికుల సమస్యలను దగ్గరుండి చూసిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ వాహన మిత్ర పథకానికి శ్రీకారం చుట్టారు. ఏటా క్రమం తప్పకుండా రూ.10వేలు అందిస్తూ చేదోడుగా నిలిచారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఆటో కార్మికులు కష్టాలు తీర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సాయం మాటల్లో చెప్పలేమని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలను క్రమం తప్పకుండా అమలు చేసిన దాఖలాలు లేవని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే ఇచ్చిన మాటకు కట్టుబడి పాలన సాగిస్తున్నారని ఆటో కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జగనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తున్నారు.

జోన్-5 ఉత్తర నియోజకవర్గ పరిధిలో 2023-24 ఏడాదికి గాను ఆటో కార్మికులకు వైఎస్సార్ వాహన మిత్ర పథకంలో సుమారు 3,575 మంది లబ్ధిదారులకు రూ.3,57,50,000లు ఆటో కార్మికుల ఖాతాల్లో జమ చేసినట్లు జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ తెలిపారు. గత ప్రభుత్వాలు విద్య, వైద్యాన్ని వ్యాపారంగా మార్చి పేదలకు భారం మోపాయి. వైఎస్ జగన్ పాలనలో నాడు-నేడు ద్వారా కార్పొరేట్ స్థాయిలో ఆటో కార్మికుల కుటుంబాలకు విద్య, వైద్యం ఉచితంగా అందజేస్తున్నారు. వాహన మిత్ర ద్వారా ఆర్థిక కష్టాలనుంచి గట్టెక్కిస్తున్నారు. ఫైనాన్స్‌పై ఆటోలు కొనుగోలు చేసి.. రోజంతా కష్టపడి వచ్చిన డబ్బులతో అప్పులు తీర్చేవారు. ఇది చాలా భారంగా ఉండేది. అప్పులు తీర్చలేకపోవడంతో ఫైనాన్స్ కంపెనీలు ఆటోలను తమ సొంతం చేసుకునేవారు. వైఎస్సార్ ప్రభుత్వ పాలనలో ఆటో కార్మికులకు అన్నలా వైఎస్సార్ వాహన మిత్ర పథకం ఆదుకుంటుంది.

జోన్-5 పరిధిలో 2023-24 సంవత్సరానికి వైఎస్సార్ వాహన మిత్ర పథకం లబ్ధిదారుల వివరాలు

వార్డు	లబ్ధిదారులు(ఆటో కార్మికులు)	రూ.లు
43	48 మంది	4,80,000
44	139	13,90,000
45	298	29,80,000
46	253	25,30,000
47	148	14,80,000
48	139	13,90,000
49	148	14,80,000
50	158	15,80,000
51	162	16,20,000
53	121	12,10,000
54	112	11,20,000
55	1849	1,84,90,000

మొత్తం లబ్ధిదారుల సంఖ్య- 3575 మంది.
వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా పొందిన నగదు-రూ 3,57,50,000లు

కొత్త ఆటో కొనుగోలు చేశా



గతంలో ఫైనాన్స్‌పై ఆటో కొనుగోలు చేశా. నాలుగేళ్లగా వైఎస్సార్ వాహన మిత్ర పథకంతో పాత అప్పు పూర్తిగా తీర్చేసి కొత్త ఆటో కొనుగోలు చేశా..వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సొంత ఆటో నడుపుతూ కుటుంబానికి పోషించుకుంటున్నాను. ముఖ్యమంత్రి రుణం తీర్చుకోలేను.
-పుట్టా సురేష్,
ఆటో డ్రైవర్, ఊర్వశికూడలి

కష్టాలు తీరాయి



అప్పులు చేసి ఆటో కొని కుటుంబాన్ని నెట్టుకొస్తున్న సమయంలో ప్రజాసంకల్ప యాత్రలో ఆటో కార్మికుల సమస్యలను చూసిన జగనన్న అధికారం చేపట్టిన తరువాత వైఎస్సార్ వాహన మిత్ర పథకం ప్రవేశపెట్టి మా కష్టాలు తీర్చాడు. వాహన మిత్ర ద్వారా వచ్చే డబ్బుతో అప్పులు తీరాయి. రుణం పూర్తిగా తీర్చేసి సంతోషంగా ఉన్నాం.
- కొరిబిల్లి సత్యనారాయణ,
ఆటో కార్మికుడు, కంచరపాలెం

అర్హులందరికీ 'వాహనమిత్ర'



జోన్-5 పరిధిలో అర్హులైన లబ్ధిదారులకు 'వైఎస్సార్ వాహన మిత్ర' పథకం ద్వారా ఆటో కార్మికుల ఖాతాల్లో నగదు జమ చేయడం జరిగింది. లబ్ధిదారులను గుర్తించి పథకం చేరువయ్యేలా చర్యలు తీసుకున్నాం. ఆటో కార్మికులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుంది. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు ప్రతి లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకుంటాం.
- ఆర్‌జీవీ కృష్ణ, జెడ్సీ, జోన్-5 జ్ఞానాపురం.

ప్రజల కోసం పుట్టిందే వైఎస్సార్‌సీపీ


పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న కె.కె.రాజు, పార్టీ శ్రేణులు

ఆవిర్భావ వేడుకల్లో ఉత్తర సమన్వయకర్త కేకే రాజు

సీతమ్మధార : ప్రజలంతా బాగుండాలి..వారికి ఏ కష్టం రాకూడదు..పాలకులు ప్రజలను రక్షించేవారిలా ఉండాలి...అనే ఆకాంక్షతో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించిందని పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు అన్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ వేడుకలు పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం పార్టీ జెండాను కేకే రాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా కేక్‌కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయసాధనకు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఒక సాధారణ నాయకుడిగా వైఎస్సార్‌సీపీని స్థాపించారన్నారు. పార్టీ స్థాపించిన నాటి నుంచి పాదయాత్ర చేస్తూ ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకున్నారని చెప్పారు. నిత్యం ప్రజలతో మమేకమై ముఖ్యమంత్రిగా కోట్లాది మంది ప్రజల మంచి కోరే గొప్ప మనసున్న నాయకుడిగా ఎదిగారన్నారు. ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించిన ఐదేళ్ల కాలంలో సంక్షేమంతో పాటుగా అభివృద్ధిని చేసి చూపించారన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస రావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు చల్లా రజని, కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మరెడ్డి, సారిపల్లి గోవింద్, ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, వి.ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, కేవీఎన్ శశికళ, డైరెక్టర్స్, మహిళలు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ


టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేస్తున్న గొండు సీతారామ్, రామ్మోహన్

సీతంపేట: తమ్మినేని ఇందువతమ్మ చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారామ్ అన్నారు. ఈనెల 18 నుంచి పదో తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ట్రస్ట్ రెండు వేల మంది విద్యార్థులకు సమకూర్చిన రైటింగ్ ప్యాడ్స్, పెన్నులు పంపిణీ కార్యక్రమం అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో జరిగింది. అంతర్జాతీయ మానవ హక్కుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పప్పల రామ్మోహన్‌తో కలిసి గొండు సీతారామ్ వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారామ్ మాతృమూర్తి తమ్మినేని ఇందువతమ్మ పేరిట శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలసలో కొన్నేళ్ల కిందట ట్రస్ట్ స్థాపించి పేద,బడుగు వర్గాల ప్రజలకు సేవలందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం లక్ష్మీ నరస, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ రమణకుమారి, చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్‌ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శకుంతల, నగర కన్వీనర్ కె.ఎల్లయ్య, ఎఎస్సార్ జిల్లా కన్వీనర్ బి.లవకుశ, కార్యదర్శి ఎం.హరీష్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

మద్రిపాలెం : కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం సుభాష్‌నగర్‌కు చెందిన సీరం సత్యవేణి (46)కి సీరం సురేష్‌తో 1999లో వివాహం జరిగింది. సురేష్ ఎయిర్‌పోర్టులోని ఇమిగ్రేషన్ డిపార్ట్‌మెంట్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పిల్లల చదువుల కోసం చాలామంది వద్ద సత్యవేణి అప్పులు చేసింది. మృతురాలి తల్లిదండ్రులు మురళీనగర్‌లో ఉంటారు. సోమవారం సాయంత్రం సత్యవేణిని ఇంటికి తల్లి రమణమ్మ వెళ్లింది. మంగళవారం ఉదయం రమణమ్మ తిరిగి మురళీనగర్‌లోని తన ఇంటికి వచ్చేసింది. కాసేపటి తర్వాత తన కుమార్తె మృతిచెందినట్టు అల్లుడు ఫోన్‌చేసి చెప్పడంతో ఆమె హుటాహుటిన కుమార్తె ఇంటికి చేరుకుంది.

అల్లుడు,కుమార్తె మధ్య ఎటువంటి మనస్పర్థలు లేవని, తమ కుమార్తె మృతిపై ఎటువంటి అనుమానాలు లేవని రమణమ్మ ఫిర్యాదులో పేర్కొంది. సీఐ ఎస్ భాస్కరరావు నేతృత్వంలో ఎస్ఐ షేక్ సమీర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

కేంద్ర బలగాలు ఫ్లాగ్ మార్చ్


ఆశీలమెట్ట వద్ద కవాతు చేస్తున్న సీఐఎస్ఎఫ్, పోలీసు బలగాలు

సీతమ్మధార : రాన్ను సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మంగళవారం ద్వారకాజోన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పోలీసులు, కేంద్ర బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. ఇందులో భాగంగా నగర పోలీస్ కమిషనర్ డా.రవిశంకర్ ఆదేశాల మేరకు ద్వారకాజోన్ ఏసీపీ రాంబాబు ఆధ్వర్యంలో సీఐ ఎస్.రమేష్ నేతృత్వంలో ఆశీలమెట్ట నుంచి సివిల్ పోలీసులు, సీఐఎస్ఎఫ్ బలగాలు సంయుక్తంగా కవాతు చేపట్టాయి. ఆశీలమెట్ట, ద్వారకానగర్, అశోక్‌నగర్, రెల్లి వీధి, తదితర ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ రాంబాబు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ నిమిత్తం సీఐఎస్ఎఫ్ బలగాలు నగరానికి చేరుకున్నాయన్నారు. సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. ఫోర్త్ టౌన్ సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ రోడ్డు కూడా కేంద్రబలగాలు, పోలీసులు కవాతు నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో సీఐ.ఎస్.రమేష్, ఎస్ఐ.శ్రీను, సీఐఎస్ఎఫ్ అధికారులు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో బ్యాంకు సేవలు


ఖాతాదారులను సత్కరిస్తున్న బ్యాంక్ చైర్మన్

మద్రిపాలెం: చిన్న,మధ్య తరగతి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే విధంగా కనకమహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకు సేవలందిస్తోందని బ్యాంకు చైర్మన్ కె.రాంబాబు అన్నారు. బ్యాంకు రజతోత్సవాల్లో భాగంగా మురళీనగర్ శాఖ ఆవరణలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఖాతాదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రంగాల వారికి అనుగుణంగా అధునాతన టెక్నాలజీతో బ్యాంకు సేవలను అందజేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు వివిధ జిల్లా ల్లో 28 శాఖలను ఏర్పాటు చేశామన్నారు. 1,707 మంది సభ్యులతో రూ.38.38 లక్షల షేర్‌ధనంతో కేవలం ఏడుగురు సిబ్బందితో ప్రారంభమైన బ్యాంకు దినదినాభివృద్ధి చెంది ప్రస్తుతం 17,400 మంది సభ్యులతో రూ.32 కోట్ల మూలధనంతో అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంకు రంగంలోనే ముందంజలో ఉందన్నారు. బ్యాంకు డైరెక్టర్ బి.నాగేశ్వరరావు తదితరులు మాట్లాడారు. అనంతరం ఖాతాదారులను చైర్మన్ రాంబాబు సత్కరించారు. సమావేశంలో ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.శ్యామ్‌కిశోర్, ఓఎస్డీ శాస్త్రి, మురళీనగర్, పెందుర్తి బ్రాంచ్ మేనేజర్లు శ్రీదేవి, ఎ.నరసింగరావు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

అక్రమ నిర్మాణం కూల్చివేత


బాలయ్యశాస్త్రిలేఅవుట్‌లో శ్లాబ్‌ను కూల్చుతున్న జీవీఎంసీ సిబ్బంది

సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 14 వార్డు బాలయ్యశాస్త్రిలేఅవుట్‌లోని మోర్ వెనుక రోడ్డులో గెడ్డ స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన ప్రహరీని జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల ఆదేశాల మేరకు కూల్చివేశారు. అలాగే భవనం శ్లాబ్‌ను కూడ కూల్చేశారు. ఈసందర్భంగా టీపీవో ప్రమీల మాట్లాడుతూ అక్రమంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అభివృద్ధి పనులపై సమీక్ష


మాట్లాడుతున్న కేకేరాజు

సీతమ్మధార: విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులపై మంగళవారం వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కేకేరాజు ఆధ్వర్యంలో కార్పొరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు వార్డుల్లో పూర్తి అయిన పనులపై ఆరా తీశారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు ఎంత వరకు వచ్చాయి, జరగాల్సిన పనులుపై కార్పొరేటర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు కంటిపాము కామేశ్వరి, చల్లా రజని, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడిపద్మారెడ్డి, సారిపల్లి గోవింద్ ,ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, వి.ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, కేవీఎన్ శశికళ, కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, వార్డు అధ్యక్షులు నీలిరవి, పీలా వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లతో సారిపల్లి భేటీ


మాట్లాడుతున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు ఐదు సచివాలయాల పరిధిలో సేవలందిస్తున్న వలంటీర్లతో వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ సమీక్షా సమావేశం నిర్వహించారు. మధురానగర్ సచివాలయంలో జరిగిన సమావేశంలో 137 మంది వలంటీర్లు పాల్గొన్నారు. వార్డు పరిధిలో గడిచిన నాలుగున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, నవరత్నాల పథకాల అమలు, ఇతర సంక్షేమపథకాల అమలు తీరుపై చర్చించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు.

వైఎస్సార్, యోగి వేమన విగ్రహాల ఆవిష్కరణ


నక్కవానిపాలెంలో ఇందిరాగాంధీ ఉద్యాయన వనంలో ఏర్పాటు చేసి వైఎస్సార్, యోగి వేమన విగ్రహాలను ఆవిష్కరిస్తున్న విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఉత్తర సమన్వయకర్త కేకే రాజు

సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 24 వార్డు పరిధి నక్కవానిపాలెం గ్రామంలోని ఇందిరాగాంధీ ఉద్యాన వనంలో 24 వార్డు కార్పొరేటర్ సాడి పద్మా రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దివంగత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి, యోగి వేమన విగ్రహాలను విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఉత్తర సమన్వయకర్త కేకేరాజు మంగళవారం ఆవిష్కరించారు. ముందుగా విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి సుభిక్ష పాలన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని, ఆయన ఆశయసాధనకై ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల అభిమానాన్ని చూరగొన్నారన్నారు. ఉత్తర సమన్వయకర్త కేకేరాజు మాట్లాడుతూ దేశరాజకీయాల్లో దివంగత నేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి రోల్‌మోడల్ అని కొనియాడారు. తండ్రిని ఆదర్శంగా తీసుకున్న జగనన్న రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో విశాఖ ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రెయ్యి వెంకటరమణ, మండల పార్టీ అధ్యక్షులు జి.వి.రమణి, జేసీఎస్ కన్వీనర్ కర్రి మురళీకృష్ణారెడ్డి, ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ట్రస్ట్ చైర్మన్ నక్క అప్పలరెడ్డి, రఘురామి రెడ్డి, గుడ్ల రామూర్తి రెడ్డి, నక్క ప్రకాష్‌రెడ్డి, రేసపువానిపాలెం గ్రామ అధ్యక్షుడు బేరి గురుమూర్తిరెడ్డి, పి.విష్ణుమూర్తిరెడ్డి, దల్లి రామకృష్ణారెడ్డి, నక్క కన్నరెడ్డి, వేమన సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు సత్తి నాగేశ్వరరెడ్డి, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ బాకి శ్యాంకుమార్‌రెడ్డి, సంఘం నాయకులు కర్రి రామారెడ్డి, సంజీవరెడ్డి, బొర కుమార్‌రెడ్డి, సత్తి సుబ్బిరెడ్డి పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌ను సందర్శించిన డీసీపీ మణికంఠ

సీతమ్మధార : నగర పోలీస్ కమిషనరేట్ పరిధి డీసీపీ-1 మణికంఠ మంగళవారం ఫోర్తు టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఆయన బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటిసారిగా స్టేషన్‌కు వచ్చారు. పెండింగ్ కేసుల వివరాలతో పాటు లోక్ ఆదాలత్‌లో ఉన్న కేసులను పరిశీలించారు. రౌడీషీటర్లపై ఆరా తీశారు. ఆయనతో పాటు సీఐ విజయకుమార్ ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలో 132 కేవీ హెచ్‌టీ టవర్ ఏర్పాటు, కండక్టర్ మార్పుల్లో భాగంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-1 ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. ఈ మేరకు అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్డు, ఎన్‌జీటీస్ కాలనీ, వినాయక టెంపుల్ దరి గ్రీన్‌పార్కు ఏరియా, అబిడ్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

రోడ్డు పనులతో ట్రాఫిక్ సమస్య


బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో రహదారిని మూసివేస్తు డంప్ చేసిన మెటీరియల్

సీతమ్మధార: జీవీఎంసీ 14 వార్డులోని బాలయ్యశాస్త్రిలేఅవుట్ పరిధిలో పలు ప్రాంతా లలో రోడ్లపై ఇసుక, పిక్క వేయడంతో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారింది. రోడ్డు మొత్తం క్లోజ్ చేయడంతో పాదచారులు,వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. స్పెన్సర్ ఎదురుగా గల రోడ్డు మూసివేయడంతో రాకపోకలకు కష్టతరంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల ప్రక్రియలో ఐటీ సభ్యుల పాత్ర కీలకం

జేసీ కె.మయూర్ అశోక్


యాప్ పనితీరు వివరిస్తున్న అధికారి


శిక్షణలో పాల్గొన్న జేసీ మయూర్ అశోక్, జీవీఎంసీ ఏడీసీ విశ్వనాథన్

మహారాణిపేట: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో ఐటీ సభ్యుల పాత్ర చాలా కీలకమని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అన్నారు. ఐటీ అప్లికేషన్స్, యాప్స్ వినియోగం, తదితర అంశాలపై వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో వివిధ విభాగాల నుంచి ఎంపికైన ఐటీ టీం సభ్యులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. జీవీఎంసీ ఏడీసీ కె.ఎస్.విశ్వనాథన్‌తోపాటు పాల్గొన్న జేసీ పలు అంశాలపై మాట్లాడారు. ఐటీ టీం సభ్యులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడ ఏం జరిగినా జిల్లా కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలన్నారు. ఎన్నికల నియమావళి దాటి ఎవరు ప్రవర్తించినా, ఉల్లంఘనలకు పాల్పడినా సీ విజిల్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో వచ్చిన ఫిర్యాదులు, ఇతర అంశాలపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఐటీ అప్లికేషన్లు, సి.విజిల్ యాప్ వినియోగంపై ఎన్ఐసీ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డెమో ఇచ్చారు. ఆయా నియోజకవర్గాల ఏఆర్వోలు, ఏఈఆర్వోలు, ఐటీ బృంద సభ్యులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పోర్టులో అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

జగదాంబ: పోర్టులోని వేదాంత కంపెనీ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అదే కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న పోతనపల్లి రాజేశ్వరరావు మంగళవారం మధ్యాహ్నం వీపీటీ సరిహద్దులోని ఔటర్ గోడ రైల్వే ట్రాక్ ఎదురుగా ఈ మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే హార్బర్ పోలీసులు సమాచారమిచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. చనిపోయిన వ్యక్తి వయసు 50 నుంచి 55 ఏళ్లు ఉంటుందని, మృతదేహం కుళ్లిపోయి ఉందన్నారు. నీలం రంగు షర్ట్, బ్రౌన్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. అతని ఆచూకీ తెలిసిన వారు 91548 79915లో సంప్రదించాలని కోరారు.

ఎన్నికల విధులపై దిశానిర్దేశం


అధికారులకు పలు సూచనలు చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ అఖిల

సీతమ్మధార : రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ కలెక్టర్, ఉత్తర నియోజకవర్గ ఎన్నికల అధికారి డి.అఖిల అన్నారు. సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో ఎన్నికల అధికారులు, పోలింగ్ బూత్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. పోలింగ్ బూత్‌ల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు, విధివిధానాలను వివరించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీతమ్మధార తహసీల్దార్, జి.శ్రీరాంమూర్తి, అర్బన్ డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, జీవీఎంసీ అధికారులు, ద్వారకా పోలీస్‌స్టేషన్, ఫోర్తుటౌన్ పోలీసులు పాల్గొన్నారు.